నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 21 ఏప్రిల్ 2024 | YADADRI BHUVANAGIRI

## మూడో రోజు ఆరు నామినేషన్లు



రిటర్నింగ్ అధికారి హనుమంతు కె.జెండగేకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థి రమేశ్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 20 : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మూడో రోజు శనివారం భువనగిరి ఎంపీ స్థానానికి ఐదుగురు ఆరు సెట్ల నామినేషన్లు వేశారని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే తెలిపారు. స్వతంత్ర అభ్యర్థి ధీరావత్ గోపీనాయక్, బహుజన రిపబ్లిక్ సోషలిస్ట్ పార్టీ అభ్యర్థి కదిరె కిరణ్‌కుమార్, బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థి పెంట రమేశ్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి కొంగరి లింగస్వామి ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థి ఊదరి మల్లేశం రెండు సెట్ల నామినేషన్లు వేశారు.

## సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 20 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూజీకేవై) ఆధ్వర్యంలో నిర్వహించే ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ సాయిలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల పరిమితితో కూడిన బేసిక్ కంప్యూటర్స్ (డాటా ఎంట్రీ ఆపరేటర్) ఇంటర్మీడియట్ పాస్, ఎకౌంట్స్ అసిస్టెంట్ ట్యాలీ (బీకాం పాస్), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ (ఇంటర్మీడియట్ పాస్), ఆటోమొబైల్ టూవీలర్ సర్వీసింగ్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ (పదో తరగతి పాస్), ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్, సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ సర్వీస్ (పదో తరగతి పాస్, ఐటీఐ ఉన్నవారికి ప్రాధాన్యత) కోర్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు సర్టిఫికెట్ జిరాక్స్, పాస్ పోర్టు సైజ్ ఫొటో, ఆధార్, రేషన్‌కార్డుతో మే ఒకటిలోపు సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111లలో సంప్రదించాలని సూచించారు.

# నీళ్లిచ్చిందెవరు.. కన్నీరు తెప్పిస్తున్నదెవరు?

**కేసీఆర్ ఇచ్చిన పథకాలను అమలు చేయలేని చేతగాని ప్రభుత్వం ఇది**

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- నెమ్మికల్ నుంచి నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల ప్రచారం ప్రారంభం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

## నాలుగు నెలల క్రితం ఓటేస్తే ఇప్పుడేం జరుగుతున్నదో అందరికీ తెలుసు



ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో ప్రచారం ప్రారంభించి మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బడుగుల

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 20 : 'బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పుష్కలంగా సాగు, తాగునీటిని ఇచ్చి ప్రజలను సంతోషంగా ఉంచాం. నాలుగు నెలల క్రితం కాంగ్రెస్ పార్టీ చెప్పిన మోసపూరిత వాగ్దానాలు, మాయ మాటలు నమ్మి ఓటేసి గెలిపిస్తే పంటలకు సాగునీరు బంద్ అయ్యాయి. గుక్కెడు తాగునీటికి సైతం కాంగ్రెస్ కష్టాలు తెచ్చిపెట్టడంతో నేడు ప్రజలు కన్నీరు కార్చే పరిస్థితి నెలకొంది.' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి ఆత్మకూర్.ఎస్ మండలం నెమ్మికల్‌లో శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అంతకుముందు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డితో కలిసి దండు మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కోలాటాలు, డప్పుచప్పుళ్లతో దండు మైసమ్మ ఆలయం నుంచి నెమ్మికల్ పశువుల సంత చౌరస్తా వరకు సుమారు పది వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు సూచించారు. నాలుగు నెలల క్రితం వేసిన ఓటు ఏమి తెచ్చింది.. పదేండ్ల క్రితం వేసిన ఓటు ఏమి తెచ్చిందో ప్రజలు ఒకసారి ఆలోచించాలన్నారు. జిల్లాలో ఇద్దరు పనికిరాని దద్దమ్మ మంత్రులున్నారని, పంటలు పూర్తిగా ఎండిపోయేలా చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తానొక్కడినే మంత్రిగా ఉండి సూర్యాపేట జిల్లాను సస్యశ్యామలం చేశానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు 24గంటల కరెంట్, సాగునీరు, తాగునీరు అందించిన ఘనత తమదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు నీళ్లు ఇవ్వక పొలాలు ఎండిపోవడమే కాకుండా వచ్చిరాని కరెంట్‌తో మోటార్లు కాలిపోతున్నాయని తెలిపారు. 2014కు ముందు రైతులు బావుల ద్వారా వ్యవసాయం చేసేవారని అప్పుడు వేలాది ఎకరాలు ఎండిపోయాయని, మళ్లీ నేడు అదే పరిస్థితి వచ్చిందని అన్నారు. జిల్లా మంత్రులు పట్టించుకోకుండా వ్యాపారులు, మిల్లర్లు, క్రషర్ మిల్లర్ల వద్ద డబ్బు వసూలు చేస్తూ వ్యాపారం చేస్తున్నారు తప్ప పంటను కొనుగోలు చేయాలనే సోయి లేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, అడిగిన వారిని చెప్పుతో కొడుతామని మాట్లాడుతూ వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నారన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2500, నిరుద్యోగులకు రూ.4వేల భృతి, పింఛన్ రూ.4వేలు, కల్యాణలక్ష్మి తులం బంగారం, విద్యార్థినులకు బ్యాటరీ స్కూటీలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయినా ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. ఈ పథకాల్లో ఏ ఒక్కటి అమలు చేసినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని, అమలు కాకుంటే బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో పొలాలు ఎండిపోయి రైతులకు సుమారు రూ.600 కోట్ల నష్టం జరిగిందని తెలిపారు. వారిని పట్టించుకునే నాథుడే లేడన్నారు. కనీసం కేసీఆర్ ఇచ్చిన పథకాలను కూడా అమలు చేయలేని దద్దమ్మ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఇదే అవకాశమని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జి రాంచంద్రనాయక్, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తూడి నరసింహారావు, నాయకులు చంద్రారెడ్డి, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, యాదగిరి, సత్యనారాయణరెడ్డి, జానయ్య, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

### అమలు కాని హామీలతో కాంగ్రెస్ మోసం చేసింది

అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి మోసం చేసింది. శాసనసభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేని దద్దమ్మ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించింది. రైతు రుణమాఫీ, కల్యాణలక్ష్మి, నిరుద్యోగ భృతి ఏమైందో చెప్పాలి. రైతుబంధు ఇవ్వలేదు. మనమంతా కలిసికట్టుగా పని చేసి నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

– బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

### మీ కోసం సైనికుడిలా పని చేస్తా

రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు రైతులు, ప్రజల సమస్యలు తెలుసు. వాటి పరిష్కారం కోసం పార్లమెంట్‌లో తెలంగాణ గళం విప్పేందుకు సైనికుడిలా పని చేస్తా. ప్రజలంతా ఆశీర్వదించి గెలిపిస్తే మీలో ఒకడిగా ఉండి పని చేస్తా. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లి తన గొంతును వినిపిస్తా. కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో నన్ను గెలిపించండి.

– కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి



ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు, జనం



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ తరుణ్‌జోషి

## ఆరుబయట నిద్రించే మహిళలే లక్ష్యంగా చోరీలు

- వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అరెస్టు
- 41తులాల బంగారం, 2 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ తరుణ్‌జోషి

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 20 : వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా నిలిచిన దొంగల ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాచకొండ సీపీ తరుణ్‌జోషి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని హన్మాపురం గ్రామ పరిధిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పొట్టేటి మరియదాస్, అతని తమ్ముడు శాంతయ్య బతుకుదెరువు కోసం వలిగొండ మండలం సంగెం గ్రామానికి వచ్చి భార్యాపిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మోత్కూరు మండలం దత్తప్పగూడేనికి చెందిన కర్నె లక్ష్మితో మరియదాస్‌కు పరిచయం ఏర్పడింది. లక్ష్మి భర్త చనిపోగా మరియదాస్ ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. రెండు కుటుంబాల పోషణ భారమై మరియదాస్ దొంగతనాలకు అలవాటుపడ్డాడు. 2019లో భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 14 గొర్రెలు, 2023లో తుర్కపల్లి, భువనగిరిలో దొంగతనాలు చేశాడు. ఆ తర్వాత మరియదాస్ తన సోదరుడు శాంతయ్య, లక్ష్మి, అమ్మనబోలుకు చెందిన బాణాల రాజేశ్ ముఠాగా ఏర్పడి 2023నుంచి జిల్లాలోని ఆత్మకూరు(ఎం), ఆలేరు, మోత్కూరు, యాదగిరిగుట్ట, భువనగిరి, మోటకొండూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఈ క్రమంలో డీసీపీ పర్యవేక్షణలో కొద్ది రోజులుగా పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆలేరు మండలం జీడికల్ క్రాస్ రోడ్డు వద్ద యాదగిరిగుట్ట సీఐ కొండల్‌రావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరాలను అంగీకరించారు. వారి నుంచి 41తులాల బంగారం, రెండు కిలోల వెండి ఆభరణాలు, ద్విచక్ర వాహనం, దొంగతనాలకు ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగలను పట్టుకున్న పోలీసులను సీపీ తరుణ్‌జోషి అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో డీసీపీ రాజేశ్‌చంద్ర, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ రమేశ్‌కుమార్, సీఐ కొండల్‌రావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు



నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు



బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

## కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఏప్రిల్ 20 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా త్వరలో మిర్యాలగూడ పట్టణంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో నిర్వహిస్తారని, బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అడవిదేవులపల్లి, దామరచర్ల మండలాల పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో కేసీఆర్ బస్సు యాత్ర నిర్వహిస్తున్నారన్నారు. పార్టీ శ్రేణు లు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ లలితా హాతీరాంనాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ బైరం సంపత్, నా యకులు వీరకోటిరెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, పడిగపాటి పెద్దకోటిరెడ్డి, కొత్త మర్రెడ్డి, భీమానాయక్, కుర్ర శ్రీనునాయక్, వీరానాయక్ పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డిది రాక్షస పాలన

- మళ్లీ మోసపోతే గోసపడుతాం
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి
- ఆత్మకూరు(ఎం)లో ఉత్సాహంగా బీఆర్ఎస్ రోడ్‌షో
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గులాబీ శ్రేణులు



ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, చిత్రంలో ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 20 : రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి రాక్షస పాలన కొనసాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, పార్లమెంటు ఎన్నికల్లో మళ్లీ మోసపోతే గోసపడుతామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని తిమ్మాపురం ఎక్స్‌రోడ్డు నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు 2కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, కోలాటం, ఒగ్గు కళాకారుల ఆటపాటలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాగు, సాగునీటి కష్టాలు వచ్చాయన్నారు. హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి పూటకో మాట చెప్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందాయని, నేటి కాంగ్రెస్ పాలనలో అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించి మాట తప్పిన కాంగ్రెస్‌ను మట్టి కరిపించాలని పిలుపునిచ్చారు. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సుదగాని హరిశంకర్‌గౌడ్, తొట్ల స్వామి, మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, ఎంపీటీసీ యాస కవిత, నాయకులు వెంకటేశ్‌గౌడ్, భిక్షపతి, ఇంద్రారెడ్డి, ఉప్పలయ్య, రమేశ్, అరుణ, ధనలక్ష్మి, వెంకన్న, అంజిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

### ఆశీర్వదించండి అండగా ఉంటా..

పార్లమెంట్ ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు అండగా ఉండి అభివృద్ధి చేస్తా. 38 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్న నేను మచ్చలేని నాయకుడిగా గుర్తింపు పొందడం సంతోషంగా ఉన్నది. కేసీఆర్ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాకంతక పాలన సాగిస్తున్నది. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ప్రజలంతా ఓటు వేసి నన్ను గెలిపిస్తే పార్లమెంటులో తెలంగాణ వాణి వినిపిస్తా.

– క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి

### కాంగ్రెస్, బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

పార్లమెంటు ఎన్నికల్లో మోసకారి కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి. బడుగు, బలహీన వర్గాలకు చెందిన బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని అన్నం పెట్టిన రైతులకు సున్నం పెట్టారు. ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని బోగస్ మాటలు చెప్పి రైతులను మోసం చేస్తున్న నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. ప్రజలంతా బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలి.

– బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే




ఆత్మకూర్(ఎం)లో ఎన్నికల ర్యాలీకి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు



జాతీయ సెమినార్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు

## జూన్ 24న ఎంజీయూలో జాతీయ సెమినార్

- పోస్టర్ ఆవిష్కరించిన వీసీ గోపాల్‌రెడ్డి

రామగిరి, ఏప్రిల్ 20 : తెలంగాణ కామర్స్ అసోసియేషన్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జూన్ 24న నల్లగొండలోని ఎంజీయూలో నిర్వహించనున్న జాతీయ సెమినార్ పోస్టర్‌ను శనివారం యూనివర్సిటీలో వీసీ సీహెచ్. గోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమినార్లు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కామర్స్ హెచ్‌ఓడీ ఆకుల రవి మాట్లాడుతూ తెలంగాణ కామర్స్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం పురస్కరించుకుని 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సెమినార్‌కు దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి సీనియర్ ప్రొఫెసర్లు, పరిశోధన విద్యార్థులు హాజరవుతారని వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మే 6లోగా ఓపెన్ డిగ్రీ ప్రథమ సెమిస్టర్ ఫీజు చెల్లించాలి

- కోఆర్డినేటర్ సుంకరి రాజారాం

రామగిరి, ఏప్రిల్ 20 : బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023–24 విద్యా సంవత్సరంలో డిగ్రీ వివిధ కోర్సుల్లో చేరిన ఫస్టియర్ విద్యార్థులు మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజును మే 6లోగా చెల్లించాలని నల్లగొండలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల బీఆర్ఏఓయూ స్టూడెంట్ లెర్నింగ్ సపోర్ట్ సెంటర్ కోఆర్డినేటర్ సుంకరి రాజారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులకు మే 26నుంచి జూన్ 1వరకు పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఏఓయూలో ప్రథమ సెమిస్టర్ చదివే విద్యార్థులు పరీక్ష ఫీజులను చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7382929758, 9553568049లో సంప్రదించాలని సూచించారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావ్

## ఓటు హక్కు భారం కాదు.. బాధ్యత

- దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి
- సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, ఏప్రిల్ 20 : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు భారం కాదు.. మన బాధ్యత అని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓటు ఆవశ్యకతపై వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్‌తో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం కల్పించిన సదుపాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం వృద్ధులు 17,216 మంది ఉండగా.. అందులో 85సంవత్సరాల వారు 6,425 మంది ఉన్నారని తెలిపారు. ట్రాన్స్‌జెంబర్స్ 55, అంగవైకల్యం ఉన్న వారు 1,321 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో గుర్తించిన కేంద్రాల్లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా 729 వీల్‌చైర్లు, ఆటో సదుపాయం, వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు 96శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఓటు ఆవశ్యకతపై స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ రోజు 85 సంవత్సరాలు పైబడిన వారు, మంచానికి పరిమితమైన వారికి హోమ్ ఓటింగ్ సద్వినియోగం చేసుకునేలా పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 729 ప్రాంతాల్లో ఈ సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లా ఎన్నికల అధికారి సూచనలను అనుసరించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ నూరు శాతం ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీడీపీఓ కిరణ్మయి, శ్రీవాణి, శ్రీజ, రూప, సాయిగీత, సూపర్‌వైజర్ జగతి పాల్గొన్నారు.